57 డిమాండ్లను పరిష్కరించాలి

ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల డిమాండ్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆయా శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 57 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన ఆఫీసర్స్ కమిటీ మొదటి సమావేశంలో టీజీఈజేఏసీ ప్రతినిధి బృందంతో కలిసి వారు చర్చల్లో పాల్గొన్నారు. ఈ భేటీకి రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అధ్యక్షత వహించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ఆఫీసర్ల కమిటీకి సమస్యలు వివరించారు. మంత్రులతో డిమాండ్ల గురించి చర్చిస్తామని నవీన్ మిట్టల్ హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్ కుమార్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్ గౌడ్, టీజీవోల రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ బీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే క్యాటగిరీగా పరిగణించాలి

సీతక్కకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): తమను ఒకే క్యాటగిరీగా పరిగణించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను కలిశారు. తమ పెండింగ్ వేతనాలు విడుదల చేయించినందుకు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తున్నట్టుగా తెలంగాణలోనూ అందరినీ ఒకే క్యాటగిరీగా పరిగణించాలని మంత్రికి విన్నవించా రు. సీతక్క సానుకూలంగా స్పందించినట్టు ఫీల్డ్ అసిస్టెంట్ల నాయకులు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల ప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని సీతక్క హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొలుగూరి రవి, నాయకులు ఉన్నారు.

ఏఎస్సై గంగారాంకు ఫిర్యాదు చేస్తున్న బాసర ఆలయ అర్చకులు

ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

బాసర ఆలయ అర్చక సిబ్బంది

బాసర, మే 7 : వాట్సాప్ గ్రూపుల్లో తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాసర ఆలయ అర్చక సిబ్బంది బుధవారం ఏఎస్సై గంగారాంకు ఫిర్యాదు చేశారు. భక్తులను దోచుకుని, విలాసవంతమైన గృహం నిర్మించుకుని జీవిస్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుచేసిన వారిలో ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌మహారాజ్, అచ్యుత్ మహారాజ్, ప్రదీప్ మహారాజ్, బాలకృష్ణ, సుధీర్ మహారాజ్, హరీశ్ పంతులు ఉన్నారు.

16 ఫ్లైట్స్‌ను రద్దు చేసిన ఇండిగో

అదే బాటలో స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్‌లో మెరుపు దాడులు నిర్వహించడంతో కేంద్రం గగనతలంలో ఆంక్షలు విధించింది. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలు సేవలను నిలిపివేశాయి. ఉత్తరాదిలోని శ్రీనగర్, జమ్ము, అమృత్‌సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల, బికనీర్, జోధ్‌పూర్, గ్వాలియర్‌కు విమానాల రాకపోకలను నిలిపివేశారు. హైదరాబాద్ నుంచి బయలుదేరాల్సిన 8 ఫ్లైట్లను, హైదరాబాద్‌కు రావాల్సిన మరో 8 ఫ్లైట్లను రద్దు చేసినట్టు ఇండిగో ఎయిర్‌లైన్స్ తెలిపింది. 2 విమానాల రాకపోకలను నిలిపివేసిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్.. అమృత్‌సర్‌కు వెళ్లాల్సిన 2 ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ ఢిల్లీకి మళ్లించినట్టు వెల్లడించింది. ధర్మశాల, లేహ్, జమ్ము, శ్రీనగర్, అమృత్‌సర్‌కు విమాన రాకపోకలు నిలిపివేస్తున్నట్టు 'స్పైస్‌జెట్' సంస్థ కూడా ప్రకటించింది.

ఉద్యోగులను వేరు చేసే కుట్రలొద్దు

- డిమాండ్ల సాధనకు బాసట
- కార్యాచరణ రూపొందిస్తాం
- మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ వెల్లడి
- ఉద్యోగులను అవమానిస్తారా?
- శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మండిపాటు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలతో రక్తం మరుగుతున్నది
- మాజీ ఎమ్మెల్సీ పాతూరి
- ఉద్యోగులు చస్తామంటేనే డబ్బు లిస్తారా?
- ఉద్యోగుల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ నిలదీత

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో స్వామిగౌడ్, దేవీప్రసాద్, సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులను, ప్రజలను వేరు చేసే కుట్రలు చేయవద్దని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'కాల్చుకుతింటారా? కోసుకుతింటారా?' అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉద్యోగ జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పీఆర్సీ ఇస్తామన్న హామీ 16 నెలలైనా అమలుకాలేదని మండిపడ్డారు. డీఏలు కూడా వెంటనే విడుదల చేస్తామన్నారు.. కానీ ఇంతవరకు దాని సంగతే పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగుల వెంటే ఉంటుందని స్పష్టంచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఉద్యోగులను ఎవరూ రెచ్చగొట్టడం లేదని స్పష్టంచేశారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యేలా చూశామని చెప్పారు. అడగకుండానే 73% ఫిట్‌మెంట్, హెల్త్‌కార్డులు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని పునరుద్ఘాటించారు. ఉద్యోగులకు గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ఇంతకాలం ఎదురు చూశామని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఇక సమయం మించి పోయిందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ అందకపోవడంతో వారి గుండెలు ఆగి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులను అవమానిస్తుంటే, విధిలేని పరిస్థితిలోనే వారు కార్యాచరణ ప్రకటించారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం జోక్యం చేసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగులకు డబ్బుల్లేవు కానీ.. అందాల పోటీలకు ఉంటాయా?: స్వామిగౌడ్

ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీవిత బీమా వంటి వాటికి డబ్బుల్లేవు కానీ, అందాల పోటీల నిర్వహణకు రూ.250 కోట్లు ఎక్కడినుంచి వచ్చాయని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ప్రశ్నించారు. ఏ సంక్షేమ పథకాలను నిలిపివేసి, అందాల పోటీలు పెడుతున్నారని నిలదీశారు. ఉద్యోగులు బోనస్, జీతాల పెంపుదల వంటి గొంతెమ్మ కోర్కెలు అడగడం లేదని, పైసా పైసా కూడబెట్టి దాచుకున్న డబ్బులను ఇవ్వాలని మాత్రమే అడుగుతున్నారని చెప్పారు. తమది ఉద్యోగుల కుటుంబమని, పెన్షన్ తీసుకుంటున్నామని, ఉద్యోగులను తిడితే.. తమకు బాధ ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులపై భౌతికదాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగులను, ప్రజలను వేరు చేయాలని ప్రభుత్వం చూస్తున్నదని దుయ్యబట్టారు. ఉద్యోగులు ఎవరికీ శత్రువులు కాదని చెప్పారు. వారు అడిగిన 54 డిమాండ్లలో 36 డిమాండ్స్ డబ్బులతో సంబంధం లేనివని తెలిపారు. సీఎం అడ్డదిడ్డమైన వ్యాఖ్యలతో ఉద్యోగులను అవమానించడం సరికాదని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డిది.. శాడిజం: దేవీప్రసాద్

ఉద్యోగులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన దుర్మార్గ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగ జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగులపైకి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నానికి సీఎం తెరలేపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకే సీఎం రేవంత్‌రెడ్డి వారి పట్ల అక్కసు వెళ్లగక్కుతూ.. శాడిజం చూపిస్తున్నారని దుయ్యబట్టారు. పెన్షనర్లు కోర్టులకు వెళ్లి, ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరిస్తేనే వారికి రావాల్సిన డబ్బులు ఇస్తారా? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల పట్ల ముక్కుసూటిగా మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ముక్కుసూటిగా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. హెలికాప్టర్ల కన్నా కార్ల ఖర్చే ఎక్కువ అని మంత్రి వ్యాఖ్యానించడం విడ్డూరమని మండిపడ్డారు. అంత చౌక అయితే అందరికీ హెలికాప్టర్లనే కొని ఇవ్వాలని చురకలేశారు. ఉద్యోగుల సమస్యలపై అడిగే హక్కు కేటీఆర్, హరీశ్‌రావుకు బరాబర్ ఉంటుందని స్పష్టంచేశారు. ఈ విషయంలో కేటీఆర్‌ను కాంగ్రెస్ నేతలు విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. కేసీఆర్‌ను మరిపిస్తామంటున్న రేవంత్‌రెడ్డి.. దమ్ముంటే ఉద్యోగులకు 51% ఫిట్‌మెంట్ ఇవ్వాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుమిత్ర ఆనంద్, విష్ణువర్ధన్‌రావు, కల్యాణ్‌కుమార్, భుజంగరావు, హమీద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్తం మరిగిపోతున్నది: పాతూరి

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల వల్ల తెలంగాణ ఉద్యోగుల రక్తం సలసల మరిగిపోతున్నదని, ఉద్యోగులను రాక్షసులుగా చిత్రీకరిస్తారా? అని మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. చర్చలు జరుపకుండా ఉద్యోగుల పట్ల సీఎంకు అంత ఉక్రోషం ఎందుకని ప్రశ్నించారు. కోపం ఉంటే.. ఉద్యోగులకే ఉండాలి కానీ సీఎంకు ఎందుకని నిలదీశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డబ్బులకు, సంక్షేమ పథకాలకు లింకు పెట్టడం ఏమిటని మండిపడ్డారు. సీఎం కూడా ఒక ఉద్యోగే కదా? ఆయన మాత్రం జీతం ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు.

సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ సీఎం

- పాలన చేతకాకపోతే పదవి నుంచి దిగిపో
- ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా విఫలమైన రేవంత్ సర్కార్
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా ఇర్కోడులో రైతులకు పరామర్శ

సిద్దిపేట, మే 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేవంత్ ఒక ఫెయిల్యూర్ సీఎం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి ధ్వజమెత్తారు. అప్పులు పుట్టడం లేదని మాట్లాడటం ఆయన వైఫల్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. రేవంత్‌కు పాలన చేతగాకపోతే దిగిపోవాలని డిమాండ్ చేశారు. అనాలోచిత వ్యాఖ్యలతో తెలంగాణ రాష్ట్రం పరువు తీస్తున్నాడని, ఎన్నికల ముందు ఇష్టమొచ్చిన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక అన్నింటినీ గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఎలా రోల్ మెడల్ అయింది.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎందుకు దివాలా తీసిందని ప్రశ్నించారు. బుధవారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బాధిత రైతులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అకాలవర్షంతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నా పట్టింపేలేదని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న ధ్యాస రైతులపైన లేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు దుఃఖభారంతో ఉంటే, సీఎం రేవంత్ హైదరాబాద్‌లో కూర్చొని రోజూ అందాల పోటీలపై సమీక్షలు చేస్తున్నారని విమర్శించారు. పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల బాగోగులు పట్టించుకోని సీఎం 43 సార్లు ఢిల్లీకి విమానంలో వెళ్లారని, మంత్రులు గాలి మోటర్లలో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు.

మొదటి తారీఖు జీతం.. అబద్ధం

- ఎస్సీ, బీసీ, ఎస్టీ గురుకుల టీచర్లకు ఇంకా పడలే..
- రేవంత్ సర్కారు తీరుపై గురుకుల టీచర్ల ఆగ్రహం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా మొదటి తారీఖునే వేతనం చెల్లిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటన పచ్చి అబద్ధమని గురుకుల టీచర్లు మండిపడుతున్నారు. ఈ నెలకు సంబంధించి ఇప్పటికీ ఎస్సీ, బీసీ, ఎస్టీ గురుకుల సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదని ఉదహరిస్తున్నారు. మొదటి తారీఖున వేతనం అనేది అందని ద్రాక్షగా మారింది. జనరల్ గురుకుల సిబ్బందికి తొలుత, మైనార్టీ గురుకుల సిబ్బందికి బుధవారం మధ్యాహ్నం వేతనాలు చెల్లించారు. కానీ ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల రెగ్యులర్ సిబ్బందికి మాత్రం వేతనాలు చెల్లించలేదు. ఏప్రిల్‌లో కూడా 10వ తేదీ దాటిన అనంతరమే వేతనాలు చెల్లించారని ఉదహరిస్తున్నారు. ఆయా గురుకుల సొసైటీల పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, సీవోఈల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం సిబ్బందికి మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించని దుస్థితి నెలకొన్నది.

పాలనలో రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్

- రాష్ట్రం పరువుతీసేలా వ్యాఖ్యలు
- అందాల పోటీలు కాదు.. ఫెయిల్యూర్ సీఎంల పోటీలు పెట్టాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న వేముల

మోర్తాడ్, మే 7 : పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ అయ్యారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పాలన చేతగాని రేవంత్ వెంటనే పదవి నుంచి దిగిపోవాలి, కానీ రాష్ట్రం గురించి దివాలాకోరు మాటలు మాట్లాడొద్దని సూచించారు. అందాల పోటీలు కాదు.. ఫెయిల్యూర్ సీఎంల పోటీలు పెడితే దేశంలో నంబర్‌వన్ ర్యాంక్ రేవంత్‌రెడ్డికి రావడం ఖాయమని ఎద్దేవాచేశారు. బుధవారం ఆయన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం వేముల మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరితే.. 'అప్పు పుడ్తలే, నన్ను కోసుకుని తినుండ్రి' అని మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. సొంత రాష్ట్రాన్ని బద్నాం చేసే ముఖ్యమంత్రిని దేశంలో ఎక్కడా చూడలేదని విమర్శించారు. వెంటనే రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి దించేసి పార్టీలో అర్హులైన శ్రీధర్‌బాబు, ఉత్తమ్, భట్టి లాంటి వారికి అప్పజెప్పాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి సూచించారు. అధికారంలోకి రావడం కోసం రేవంత్‌రెడ్డి లెక్కలేని హామీలు ఇచ్చాడని, కానీ ఒక్కహామీ సక్రమంగా అమలుచేయడం లేదన్నారు.

బీసీ బిడ్డల గోస బీజేపీకి పట్టదా?

- పేరుకు బీసీల పార్టీ అని ప్రచారం
- బాసరలో బీసీ స్టూడెంట్స్‌కు అన్యాయంపై నోరు మెదపరేం?
- అమ్మవారి ప్రతిష్ఠను భ్రష్టు పట్టిస్తున్న స్వామీజీకే ఆ పార్టీ మద్దతు!
- లోహిత్ కేసులో స్వామీజీని తీసుకెళ్లాక పోలీసులకు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేల ఫోన్లు
- ఆ పార్టీ నేతల ఒత్తిడితో స్వామీజీని వదిలేసిన పోలీసులు
- ఉన్నతాధికారుల్లో అసహనం
- బీజేపీ నేతలు అమ్మవారి వైపు ఉంటరా? ఆంధ్రా స్వామీజీనే సపోర్ట్ చేస్తారా? అని నిలదీత
- బాధిత బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని పెరుగుతున్న డిమాండ్

ప్రత్యేక ప్రతినిధి, మే 7 (నమస్తే తెలంగాణ) : 'మేము బీసీల పక్షపాతం.. దైవభక్తిలో మమ్మల్ని మించిన వాళ్లు లేరు'.. ఇది బీజేపీ నేతలు చెప్పుకొనే మాట! కానీ దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర విషయంలో బీజేపీ ప్రవర్తన.. వాళ్ల అసలు రంగును పట్టిస్తున్నది. తెలంగాణకు తలమానికమైన బాసర సరస్వతి ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఆంధ్రా నుంచి వచ్చిన స్వామీజీ ప్రవర్తిస్తుంటే.. పరిరక్షించాల్సిన బీజేపీ నేతలు అతడికే కొమ్ముకాస్తున్నారు. ఆ స్వామీజీకి చెందిన ప్రైవేటు వేద పాఠశాలలో ఓ బీసీ విద్యార్థి తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నా, మరో బీసీ విద్యార్థి ప్రాణాలు పోయినా ఆ పార్టీ నేతలు నోరు మెదపడం లేదు. పైగా పోలీసుల పైనే ఒత్తిడి తెచ్చి స్వామీజీని వదిలిపెట్టేలా చేశారు. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారులు బాహాటంగానే బీజేపీ నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తుండగా 'మీరు అమ్మవారి వైపు ఉంటారా? లేక ఆంధ్రా స్వామీజీకే సపోర్ట్ చేస్తరా?' అని స్థానికులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బాధితులు ఏడుస్తున్నా కనికరం లేదా?

చదువుల తల్లి నిలయమైన బాసర, నేడు అరాచక శక్తులకు ఆలవాలంగా మారింది. ఆంధ్రా నుంచి వచ్చిన ఓ వ్యక్తి స్వామిజీ ముసుగులో స్థాపించిన కేంద్రం పలు వివాదాలకు కారణమవుతున్నది. ఆ ఆశ్రమంలో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు తీవ్ర అనుమానాస్పదంగా మారగా బాసర ప్రతిష్ఠకు భంగం కలిగించాయి. బాసరలోని 'శ్రీ వేద భారతీ పీఠం' పాఠశాలలో లోహిత్ అనే విద్యార్థిపై తీవ్ర దాడి, ఇదే ఘటనలో కీలక సాక్ష్యంగా ఉన్న మరో విద్యార్థి మణికంఠ అనుమానాస్పద మృతి రాష్ట్రంలో సంచలనంగా మారాయి. ఇద్దరు అమాయక బీసీ విద్యార్థుల నెత్తుటి ఘోషకు వేద పాఠశాల నిర్వాహకుడు విద్యానందగిరి స్వామీజీయే కారణమని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులే బాహాటంగా చెప్తున్నారు. 'మా బిడ్డలకు ఈ దుస్థితి పట్టడానికి కారణం ఆయనే' అంటూ మీడియా ముందుకు వచ్చి మరీ గోడు వెళ్లబోసుకున్నారు. ఇంత జరుగుతున్నా బీజేపీ నాయకులకు కనిపించడం లేదు. బీసీల కోసమే తమ పార్టీ ఉన్నదని చెప్పుకొనే స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధులు.. ఇద్దరు బీసీ బిడ్డలకు అన్యాయం జరిగినా నోరు మెదపడం లేదు. పైగా దైవ భక్తుల్లో తమను మించిన వారు లేరని చెప్పుకొనే ఆ పార్టీ నేతలు బాసర అమ్మవారి ప్రతిష్ఠకే సదరు స్వామీజీ భంగం కలిగిస్తున్నా కిక్కురుమనడం లేదు. క్షేత్రంలో అనాదిగా వస్తున్న హిందూ సంప్రదాయాలు, ఆచారాలను ఆ స్వామీజీ మంట గలుపుతున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని స్థానికులు జిల్లా అధికారులను కలిసి విన్నవిస్తున్నారు. బాసరలో గోదావరి పుష్కర ఘాట్‌ను కబ్జా చేశాడని.. నిత్య హారతి కార్యక్రమాన్ని అడ్డుపెట్టుకొని డబ్బులు వసూలు చేస్తున్నాడని, ధనార్జనే ధ్యేయంగా పూజలు, హోమాలు చేస్తున్నాడని, చివరికి అమ్మవారి క్షేత్రంలో అనాదిగా వస్తున్న అక్షరాభ్యాసానికి పోటీగా శాస్త్రాల్లో ఎక్కడా లేని 'బీజాక్షరాలు' రాస్తానంటూ వ్యాపారం చేస్తున్నాడని చెప్తున్నారు. బాసర అమ్మవారిని అప్రతిష్ఠ పాలు చేస్తూ.. శాస్త్రాల్లో లేని విధానాలను ప్రచారం చేస్తూ హిందూత్వ హననానికి పాల్పడుతున్న వ్యక్తికే స్థానిక బీజేపీ నాయకులు మద్దతుగా నిలుస్తుండటంపై మండిపడుతున్నారు.

స్వామీజీని వదిలేయాలని ఫోన్లు

వేద పాఠశాలలో తీవ్రంగా గాయపడిన లోహిత్ కేసు విచారణలో భాగంగా మార్చి 21న నిర్వాహకుడు విద్యానందగిరి స్వామి, ఆశ్రమంలో ఉండే మాతాజీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ రోజు రాత్రి వారిని బాసర పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలిసి ఒక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ గంట వ్యవధిలోనే పదిసార్లకు పైగా పోలీసులకు ఫోన్లు చేసినట్టు సమాచారం. 'స్వామీజీని ఎట్ల అరెస్టు చేస్తరు? ఎందుకు అరెస్టు చేసింద్రు? కొండముచ్చు దాడి చేస్తే ఆయనేం చేస్తారు? వెంటనే వదిలేయండి' అని సదరు నేతలు పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. వారి ఒత్తిడి మేరకే వీళ్లను వదిలేయాల్సి వచ్చిందని స్వామీజీ ఆగడాలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రామస్థులకు ఓ పోలీసు అధికారి చెప్పారు. ఒత్తిళ్ల కారణంగా ఏమీ చేయలేకపోతున్నామని అసహనం వ్యక్తం చేశారు.

పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలు

ఆంధ్రా స్వాములేరా? బాసర అమ్మవారా?

బీజేపీ మద్దతు ఎందుకు?

బాసరలో ఇంత జరుగుతున్నా స్వామీజీకే బీజేపీ నేతలు మద్దతివ్వడం వెనుక మర్మమేంటి? అసలు ఎవరీ స్వామీజీ? ఎక్కడి నుంచి వచ్చారని ఆరా తీస్తే.. ఆయన ఆంధ్రాలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలిసింది. కాశీలో విద్యాభ్యాసం చేసే సమయంలోనే ఆయన ప్రవర్తన నచ్చక గురుకులం నుంచి వెళ్లగొట్టారని తెలిసింది. తర్వాత ఉజ్జయినిలో వేదం చదివినట్టు ఓ సర్టిఫికెట్ చూపిస్తున్నారు. తిరుపతిలోని ఓ పీఠంలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టినట్టు సమాచారం. 2007-08 ప్రాంతంలో బాసరకు రావడానికి ముందు ఓ శిష్యుడి ద్వారా అమెరికా వెళ్లారు. అన్ని కులాల వారికీ వేదం నేర్పిస్తానని అక్కడ ప్రచారం చేసినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో స్వదేశానికి వచ్చి నిజామాబాద్ జిల్లాకు ఇదే ప్రతిపాదనతో వెళ్లారు. ఆశించిన ఫలితం రాకున్నా స్థానిక బీజేపీ నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ పరిచయాలే పక్కన నిర్మల్ జిల్లాలో బాసరపై దృష్టి సారించేలా చేశాయి. స్వామీజీకి సన్నిహితుడిగా పేరున్న ఓ బీజేపీ లీడర్ ఆయనను బాసరలో వేద పాఠశాల పెట్టాలని సూచించారు. ఆ నాయకుడి ప్రోత్సాహంతో వేద విద్యానందగిరి బాసర అమ్మవారి క్షేత్రానికి వచ్చారు. ఆయన మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ నాయకులతో ఇప్పటికీ టచ్‌లో ఉంటారని తెలిసింది. అన్ని కులాల వారికి ఉచితంగా వేద విద్య అందిస్తున్నానని ప్రచారం చేసుకుంటూ ఆయా రాష్ట్రాల బీజేపీ నాయకుల ద్వారా తెలంగాణ బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులకు సైతం దగ్గరయ్యారు. బీజేపీలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు సైతం బాసరకు వచ్చి అతడిని కలుస్తుంటారు. వారితో కలిసి దిగిన ఫొటోలను స్వామీజీ పెద్దపెద్ద ఫ్రేమ్‌లు కూడా కట్టించి పెట్టుకున్నారు. వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇలా ఎందరో వేద పాఠశాలకు వచ్చి నోటిపై బీజాక్షరాలు రాయించుకున్నట్టు ఫొటోలున్నాయి. అమ్మవారి దర్శనానికి కూడా బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, హిందూ సంఘాల నాయకులను వెంటబెట్టుకొనే